విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 07, మే 2025

ఉచిత సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలి

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండలంలో ఉన్న అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించి అందుకు అనుగుణంగా అడ్మిషన్లు చేసుకోవాలని ఎంఈఓ అబ్దుల్ కలాం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు విద్య హక్కు చట్టం 121సి ప్రకారం ప్రైవేట్ పాఠశాల యజమానులు తమ అడ్మిషన్లలో 20శాతం పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులను చేర్చుకోవాలన్నారు. పేద కుటుంబాలు, తల్లి దండ్రులు లేని విద్యార్థులు సమీపంలోని ప్రైవేట్ పాఠశాలల్లో చేరేందుకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల విద్యార్థుల ఆన్లైన్ దరఖాస్తులను ప్రవేట్ పాఠశాల యజమానులు పరిశీలించి వారికి అడ్మిషన్ ఇవ్వాలన్నారు.

ఆవుల మందపై పెద్ద పులి దాడి

విశాలాంధ్ర - వెలుగోడు : తెలుగు గంగ ప్రాజెక్టులో భాగమైన వెలుగోడు రిజర్వాయర్ మద్రాస్ కాల్వ వద్ద పంట పొలాల్లో ఆవుల మందపై పెద్దపులి దాడి చేసిన సంఘటన జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారము దాడి చేసి పులి ఒక ఆవును చంపింది. మళ్లీ మంగళవారం ఉదయం 20 రోజుల ఆవు దూడను చంపిన విషయము అటవీ అధికారులకు తెలిపారు. పెద్దపులి వరుస దాడులతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. పెద్దపల్లి నుంచి ఆవులను కాపాడి, నష్టపరిహారం చెల్లించాలని రైతు సేవా నాయక్ అటవీ అధికారులను కోరారు.

ఎస్టీ కార్పొరేషన్ రుణాలను మంజూరు చేయండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పేదల అభివృద్ధి దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ బాలునాయక్ అన్నారు. మంగళవారం ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీ కార్పొరేషన్, ఎస్సీ కార్పొరేషన్ నిధులు మంజూరు చేశారన్నారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా కూడా రుణాలు మంజూరు చేసి గిరిజనులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కూటమి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా పేదలకే కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో మైదానప్రాంతంలోని ఏజెన్సీ ప్రాంతంలో అనేక మంది గిరిజనులు డిగ్రీలు చేసినప్పటికీ ఉద్యోగాలు రాక వయోపరిమితి దాటిపోయి అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, అలాంటి వారిని గుర్తించి ప్రభుత్వం రుణాలు అందించాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే మృతికి సంతాపం

విశాలాంధ్ర - బనగానపల్లె: మాజీ ఎమ్మెల్యే పాలకొండ రాయుడు మృతిపై రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. పాలకొండ రాయుడు మృతి ఆయన కుటుంబంతో పాటు, రాయచోటి నియోజకవర్గ ప్రజలకు, టీడీపీ కార్యకర్తలకు తీరని లోటన్న తెలిపారు. రాయచోటి ఎమ్మెల్యేగా నాలుగు సార్లు, రాజంపేట ఎంపీగా ఒకసారి గెలిచిన పాలకొండ రాయుడుకు రాయచోటి ప్రజలతో విడదీయలేని అనుబంధం ఉందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు

విశాలాంధ్ర - రుద్రవరం: ప్రతి వ్యవసాయ రైతు ప్రకృతి వ్యవసాయంపై ముగ్గు చూపాలని ప్రకృతి వ్యవసాయ ఎం సి ఆర్ పి శంకర్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని నరసాపురం యూనిట్‌లో భాగమైన హరి నగరం ప్రకృతి వ్యవసాయం వాటి లాభాల పై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పండించిన ధాన్యాల వల్ల ప్రజలు ఆరోగ్యంగానూ ఉంటారన్నారు. రైతులు 20 రకాలకు చెందిన విత్తనాలను భూమిలో చల్లుకోవడం వల్ల భూసారం పెరిగి భూమిలో పోషకాల విలువలు పెంచుకోవడం జరుగుతుందన్నారు. రైతులు ఎంతో విలువైన పోషక పదార్థాలను దిగుబడులు చేసుకోవడం జరుగుతుందన్నారు. వ్యవసాయ రైతులు తప్పకుండా ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపి అనారోగ్య బారిన పడకుండా ఆరోగ్య బారిన పడాలని సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ రైతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఐసిఆర్‌పిలు, గ్రామస్తులు, ఫీల్డ్ అసిస్టెంట్, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని అంగన్వాడీ సూపర్వైజర్ పార్వతి అన్నారు. మండలంలోని జి.జంబుల దిన్నె గ్రామంలోని అంగన్వాడి సెంటర్‌లో కిషోరి వికాసం వేసవి సెలవుల కార్యక్రమములో భాగంగా కిషోరి బాలికలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశుభ్రత గురించి రుతుస్రావం గురించి పాటించవలసిన నియమాల గురించి వివరిస్తూ అవగాహన కల్పించారు. ముఖ్యంగా రుతుక్రమం సమయంలో పరిశుభ్రతను పాటించాలన్నారు. బాల్య వివాహాల గురించి బాలికలకు అవగాహన కల్పించి వాళ్లలో ఉన్న సమస్యలను చర్చించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు పద్మ, హుస్సేన్ బీ, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

మహిళలు ఉపాధితో రాణించాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గడివేముల : మహిళలు స్వయం ఉపాధితో రాణించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ సహకారంతో మండల పొదుపు ఐక్య సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధితో రాణించి ఆర్థికంగా కుటుంబానికి భరోసా కావాలన్నారు. ఈ ఉచిత కుట్టుమిషన్ శిక్షణ సుమారు వంద రోజులు ఉంటుందని ప్రభుత్వం ట్రైనర్ని ఏర్పాటు చేసి మొదటి విడతగా ఉదయం 50 మంది, మధ్యాహ్నం 50 మందికి శిక్షణ ఇస్తున్నారని, శిక్షణ కు 75శాతం హాజరున్న వారికి రూ.7 వేల విలువగల కుట్టు మిషన్‌ని ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ రాజు, తహశీల్దార్ వెంకట రమణ, ఎంపీడీఓ వాసుదేవగుప్తా, ఏపీఎం నాగరాజు, మండల టీడీపీ కన్వీనర్ దేశం సత్యనారాయణ రెడ్డి, మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాస రెడ్డి, సుభద్రమ్మ, వడ్డు లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగులపై అనుచిత వాక్యలు తగదు

విశాలాంధ్ర - వెలుగోడు: ఎఎన్ఎం, సూపర్వైజర్లపై ఎంఎల్‌హెచ్‌పి, సిహెచ్ఓ చేసిన అనిచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం వేల్పనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు నల్ల రిబ్బన్ ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. ఆ తర్వాత వైద్యాధికారికి సిబ్బంది అందరూ కలసి మెమొరాండం ఇవ్వడమైనది.

రాజకీయ జోక్యాన్ని ఆపాలి : సీపీఐ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: జిల్లాగా ఏర్పడిన తర్వాత జిల్లాలో హత్యలు, హత్యాచారయత్నాలు, దాడులు, అధిక వడ్డీల వల్ల ఆత్మహత్యలు చేసుకుని ప్రజలు మృతి చెందుతున్నా పోలీస్ అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వహించడమే కారణమని, పోలీస్ యంత్రాంగంపై రాజకీయ జోక్యం లేకుండా కొత్తగా వచ్చిన ఎస్పీ వీటిపై దృష్టి పెట్టి భయం గుప్పెట్లో జీవిస్తున్న జిల్లా ప్రజలకు భద్రతా భరోసా కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతనంగా జిల్లా ఏర్పడిన తర్వాత కొత్తగా వచ్చిన అప్పటి ఎస్పీ రఘువీరారెడ్డి నిర్లక్ష్య ఫలితంగా విధి నిర్వహణలో నీతి నిజాయితీగా పోలీస్ కానిస్టేబుల్‌ను అత్యంత కిరాతంగా కిరాయి హంతకులు చంపిన పట్టించుకోకపోవడంతో పోలీస్ వ్యవస్థ కృంగిపోయి విధుల నిర్వహణలో డీలా పడిపోవడం వల్ల రౌడీషీటర్లు పెట్రేగిపోయి హత్యలు, హత్యాచారాలు, హత్యా ప్రయత్నాలు జరుగుతున్నాయని, పోలీస్ అధికారులు ఉద్యోగ నిర్వాహణలో భాగమంటూ స్కూటర్లకు, ప్రజలకు ఫైన్లు వేసుకుంటూ కాలం వెల్లదీస్తున్నారని విమర్శించారు. జిల్లాకు వచ్చిన నూతన ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా ప్రజలకు భద్రత భరోసా ఇస్తారని ఆశిస్తూ అనుకుంటే రాజకీయ కారణాలతో వారు సరైన నిర్ణయం తీసుకుపోకపోవడం వల్ల జిల్లాలో ప్రజలపై హత్య ప్రయత్నం, హత్యలు ఎక్కువయ్యాయని, ఉమ్మడి కర్నూలు జిల్లాలో పోలీసులంటే ప్రజల్లో భయం ఏర్పడేదని కానీ నేడు పోలీసులంటే ఏమాత్రం భయపడక పోవడంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు ఇలాంటి వాటిపై ఉక్కుపాదం మోపి ప్రజలకు భద్రత భరోసా కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.సోమన్న, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ పార్క్‌ల ఏర్పాటుకు స్థలాలు గుర్తించండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్క్‌ల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలు గుర్తించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆర్డీఓలు, తహశీల్దార్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఇంటిగ్రేటెడ్ రూరల్ ఎనర్జీ ప్రోగ్రాంలో భాగంగా ప్రభుత్వ భూముల స్థలసేకరణపై ఆర్డీఓలు, తహశీల్దార్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఓ రాము నాయక్, నంద్యాల, ఆత్మకూర్, డోన్ ఆర్డీఓలు విశ్వనాథ్, నాగజ్యోతి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ పార్క్ ల ఏర్పాటు కోసం ప్రభుత్వ భూముల స్థల సేకరణ చేపట్టాలని ఆర్డీఓలను, తహశీల్దార్లను ఆదేశించారు. పాణ్యం, సుగాలిమెట్ట ప్రాంతాలలో 50 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని, డోన్ మండలం ఉంగరాలగుట్ట ప్రాంతంలో కూడా వంద ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉందని సంబంధిత ప్రాంతాలలో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేసే సాధ్యాసాధ్యాలపై ఎపిఐఐసి జోనల్ మేనేజర్‌తో కలిసి పరిశీలించాలని నంద్యాల, డోన్ ఆర్డీఓలను కలెక్టర్ ఆదేశించారు. ఆత్మకూరు మండలంలో ప్రభుత్వ భూములు 2.5 ఎకరాల మేరా పరిశీలించాలని ఆత్మకూరు ఆర్డీఓను ఆదేశించారు. రిలయన్స్ కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు జిల్లాలో 5 వేల ఎకరాలను గుర్తించి నివేదికలు ఇవ్వగా అందులో 765 ఎకరాల్లో ఏర్పాటు చేయడానికి రిలయన్స్ సంస్థ నుండి అంగీకారం రావడం జరిగిందన్నారు. ప్రభుత్వ భూములు పరిశీలించి సబ్ స్టేషన్ల ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని తహశీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు.

కూలి పనులకు వెళ్లి అనంత లోకాలకు
ఆర్.పాంపల్లె గ్రామంలో విషాదం

మట్టి మిద్దె కూలి ఇరువురు మృతి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఉయ్యాలవాడ మండలం ఆర్.పాంపల్లె గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితుల్లో కూలి పనులకు వెళ్లి అనంత లోకాలకు వెళ్లారు. పొట్ట కూటి కోసం రోజు లాగానే మంగళవారం పనులు చేసేందుకు వెళ్లారు. పనిలో నిమగ్నమైన కొద్దిసేపటికే ఇద్దరు కూలీలను మృత్యువు కబలించింది. మట్టి మిద్దె కూలి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలకు వెళ్తే ఆర్.పాంపల్లె గ్రామానికి చెందిన గంప తిరుపాల్ కు చెందిన పాత ఇంటికి మరమ్మతులు చేసేందుకు ఏడుగురు కూలీలు పనికి వెళ్లారు. ఆళ్లగడ్డ మండలం లింగందిన్నెకు చెందిన కొంతమంది కూలికి వెళ్లారు. పాత మిద్దె కావడంతో మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో దంతేలు, మెత్తు పలకలు, మట్టి కింద ఉన్న కూలీలపై పడడంతో నలుగురు వ్యక్తులు అందులో ఇరుక్కొనిపోయారు. గ్రామస్తులు వెంటనే అక్కడికి చేరుకుని మట్టిలో ఇరుక్కున్న వారిని బయటకు తీశారు. ఎస్.లింగందిన్నె గ్రామానికి చెందిన బండి యోనా (45), ఆర్.పాంపల్లి గ్రామానికి చెందిన పొగాకు నారాయణ (40) అనే వ్యక్తులు మట్టి కింద పూర్తిగా కూరుకొని పోయి ఊపిరాడక అక్కడక్కడే మృతి చెందారు. చనిపోయిన ఇద్దరి మృతదేహాలను ఉయ్యాలవాడ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనలో గాయపడిన కుమార్, బాబు అనే వ్యక్తులను ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు చికిత్స అందించారు. మిగిలిన ముగ్గురు కూలీలు సురక్షితంగా బయటపడ్డారు. ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాల వద్ద మృతుల కుటుంబీకులు బోరున విలపించారు. విధి ఆడిన వింత నాటకంలో రెండు గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

నూతన భవనంలో కొనసాగించాలి

విశాలాంధ్ర-డోన్: ప్రజలకు సౌకర్యంగా ఉండే షాదీ ఖాన్ పక్కన నూతన భవనంలో సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని ప్రారంభించాలని సీపీఐ ఆధ్వర్యంలో ఆర్డీఓ ఆందోళన నిర్వహించారు. మంగళవారం డోన్ ఆర్డిఓకి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత పట్టణ కార్యదర్శి మోట రాముడు వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.సుంకయ్య మాట్లాడుతూ డోన్ పట్టణంలోని గత అనేక సంవత్సరాల నుండి డోన్ సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని సుదూర ప్రాంతంలో ఉన్న స్కిల్ డెవలప్మెంట్ కార్యాలయంలోకి ప్రారంభించాలని గత వారం క్రితం కోర్టు నుంచి ఉత్తర్వులు వచ్చినాయని జనాలు ఆందోళన చెందుతున్నారవారన్నారు. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో విలువైన డాక్యుమెంట్లు ఉంటాయి డాక్యుమెంట్లకి సరైన సెక్యూరిటీ ఉండాలంటే నడిబొడ్డున ఉన్న షాదీ ఖాన్ పక్కన నూతనంగా ఏర్పాటైన బిల్డింగ్ ఉందన్నారు. కోటి 60 లక్షలతో నిర్మించారని, ఈ భవనాన్ని వినిగించుకోకుండా ఎక్కడో అసౌకర్యం చోట విలువైన డాక్యుమెంట్లు అక్కడ పెడతామంటే డాక్యుమెంట్ లకు భద్రత లేకుండా పోతుందన్నారు. చిల్లర దొంగలు డాక్యుమెంట్లకు దొంగతనాల కూడా జరుగుతాయని డాక్యుమెంట్లను దొంగలు తారుమారు చేసే పరిస్థితి ఇక్కడ నిలయంగా ఉందని, ప్రజల ఇబ్బందులు పడకూడదని మేలుకోరే నాయకుడు, డోన్ నియోజకవర్గాన్ని ప్రాతినిధ్యం వహిస్తున్న కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డిని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బి నారాయణ, పట్టణ సహాయ కార్యదర్శి రామ్మోహన్, పుల్లయ్య, ఏఐటీయూసీ నియోజకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు అన్వర్, అబ్బాస్, అఖిల భారత యువజన సమైక్య జిల్లా అధ్యక్షులు రణత్ యాదవ్, చంద్రశేఖర్, బాల మద్దయ్య, హరి, శశి రెడ్డి ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీ అడ్మిషన్లకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి

విశాలాంధ్ర - పాములపాడు : విద్య హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25శాతం ఫ్రీ సీట్లు ఒకటవ తరగతిలో ప్రవేశాలకు ఆన్లైన్ నమోదు ప్రక్రియ ప్రారంభమైందని ఎంఈఓ -1 బాలాజీ నాయక్, ఎంఈఓ -2 సుభాషిని దేవి మంగళవారం తెలిపారు. ఈ నెల 19వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పిల్లల పుట్టిన తేదీ ధ్రువపత్రాలు ఆన్లైన్లో సమర్పించాలన్నారు. పరిశీలన అనంతరం రెండు దఫాలుగా ఫలితాలు వెల్లడించి, లాటరీ ద్వారా సీట్లు కేటాయిస్తారన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన పేద విద్యార్థులు ఉపయోగించు కోవాలన్నారు.

ఆశావర్కర్లకు చీరల పంపిణీ

విశాలాంధ్ర - చాగలమర్రి: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఆశావర్కర్లకు అశాడే సందర్భంగా సమావేశాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దాదాపు 32 మంది ఆశా వర్కర్లకు రెండు చొప్పున చీరలను వైద్యులు అంజలి పంపిణీ చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపే ఆశావర్కర్లు మరింత మెరుగైన సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ రామలింగారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలవండి

విశాలాంధ్ర - నందికొట్కూరు: సమాజంలో ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని నందికొట్కూరు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఏపి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్టిక్కర్స్‌ను పట్టణ సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఏఐటియుసి నంద్యాల జిల్లా అధ్యక్షులు రఘు రామ్మూర్తిలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రక్తదానం ఆవశ్యకత గురించి వివరించారు.ఆటో డ్రైవర్ లు వాహనాలను నడిపే టప్పుడు ప్రమాదాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి అని, డ్రైవింగ్‌లో తగు మెలకువలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఏఐటియుసి ఆధ్వర్యంలో ప్రజలకు,వాహన దారులకు అవగాహన కల్పించేందుకు స్టిక్కర్‌లను అతికించడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగేంద్ర, నాగేశ్వర్ రావ్, నాగరాజు, మాలిక్, మధు, శివ, తదితరులు పాల్గొన్నారు.

బెల్లం వ్యాపారస్తులతో సమావేశం

విశాలాంధ్ర - నందికొట్కూరు: పట్టణంలోని అల్వాల కళ్యాణ మండపంలో నందికొట్కూరు కిరాణా మర్చంట్ అసోసియేషన్, నిత్యావసరాలు హెూల్ సెల్ డీలర్స్ సభ్యు లతో అసోసియేషన్ ప్రెసిడెంట్ మన్సూర్ అహమ్మద్ అధ్యక్ష తన మంగళవారం సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి నంద్యాల అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.రాముడు నందికొట్కూరు ఎక్సైజ్ సిఐ రామాంజనేయులు హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటు సారా తయారీకి ప్రధాన వనరు బెల్లం కాబట్టి బెల్లం అమ్మకంలో నియంత్రణ పాటించాలని బెల్లం వ్యాపారులకు సూచించడం జరిగినది. మండలంలో కోళ్ల బావాపురం, నీలి షికారి కాలనీ నాటుసారా తయారీ కేంద్రాలుగా ఉన్నాయని, ఇక్కడ ఉండేటువంటి ప్రజలు నాటుసారా తయారీ వ్యాపారంగా కలిగి ఉండి విచ్చలవిడిగా నాటు సారాయి తయారుచేసి చుట్టుపక్కల గ్రామాలకు సరఫరా చేయడం, చుట్టుపక్క గ్రామాలకు వెళ్లి నాటు సారా అమ్మడం వ్యాపకంగా కలిగి ఉన్నటువంటి వ్యక్తులు వారిలో మార్పు తీసుకురావడం కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నవోదయం 2.0 అనే కార్యక్రమం చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా నందికొట్కూరులో ఉన్న బెల్లం వ్యాపారస్తులకు నాటుసారా తయారీకి ప్రధాన వనరు అలాంటి బెల్లం మీద అవగాహన కల్పించాలని ఉద్దేశంతో ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎస్సైలు జఫ్రూల్లా, భాష్యం శ్రీనివాసులు అసోషియేషన్ అధ్యక్షులు వజీర్ బాష, గౌరవ అధ్యక్షులు నగేష్ ప్రసాద్, జనరల్ సెక్రటరీ సతీష్ కుమార్, కిరాణం స్టోర్ యజమానులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీని మంత్రి ఫరూక్ నిలబెట్టుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : దౌలత్ ఖాన్ కుటంబానికి ఇచ్చిన హామీ న్యాయ శాఖ మంత్రి ఫరూక్ నిలబెట్టుకోవాలనీ దౌలత్ ఖాన్ న్యాయ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానికి జమాత్ ఏ ఇస్లామి హింద్ కార్యాలయంలో దౌలత్ ఖాన్ న్యాయ పోరాట కమిటీ సభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. కన్వీనర్ ఎజాజ్ హుసేన్ మాట్లాడుతూ మాజీ సైనికులు కార్గిల్ వీరుడు దౌలత్ ఖాన్ మరణించి 3 నెలలు గడుస్తున్నా ఇప్పటికి న్యాయం జరగలేదని, అదేవిధంగా దౌలత్ ఖాన్ మరణానికి కారణమైన నంద్యాల మునిసిపల్ కమిషనర్, మునిసిపల్ సిబ్బందిపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. న్యాయవరంగా మునిసిపల్ కమిషనర్, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ అధికారులకు కంప్లయింట్ చేయడం జరిగిందని తెలిపారు. అబ్దుల్ సమద్ మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా దౌలత్ ఖాన్ కుటుంబానికి ఆర్థిక భరోసాతో పాటు ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, సుహెల్ రానా, నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన్నంగా అప్పనపల్లి, చిన్న కమ్మలూరు గ్రామాల రస్తా

విశాలాంధ్ర - రుద్రవరం: అప్పుడెప్పుడో 40 సంవత్సరాల కిందట వేసిన రహదారి ఇంతవరకు ఏ అధికారి ఈ రహదారి వైపు కన్నెత్తి చూడక పోవడంతో అప్పుడు వేసిన రహదారి నేడు గుంతల మయంగా మారింది. రోడ్డుకు ఇరు వైపులా ముళ్ళపొదలు పెరిగి, చిట్టడవిని తలపిస్తూ ఉండడంతో గ్రామస్తుల వ్యవసాయ రైతుల రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్న దుస్థితి అప్పనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. మండలంలోని అప్పనపల్లి గ్రామం నుండి చిన్న కమ్మలూరు గ్రామానికి వెళ్లే దారి పూర్తి అధ్వాన్నంగా తయారై వ్యవసాయ రైతులకు, కూలీలకు, బాటసారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని గ్రామస్తులు తెలిపారు. వారు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలు పైన ప్రభుత్వ అధికారులు మా గ్రామం నుండి చిన్న కమ్మలూరు వెళ్లేందుకు దాదాపు 5 కిలోమీటర్ల దూరంతో కంకర వేసి రాస్తాను వేయడం జరిగిందన్నారు. అప్పటినుండి నేటి వరకు ప్రభుత్వాలు మారుతున్న, పాలకులు మారుతున్న, మా ఊరి నుండి చిన్న కమ్మలూరుకి వెళ్లే రహదారి మారడం లేదన్నారు. మా ఊరి నుండి చిన్న కమ్మలూరుకి వెళ్లేందుకు రహదారి మరమ్మతులకై పలుమార్లు ఏళ్ల తరబడి అటు పాలకులకు ఇటు అధికారులకు చెప్పిన ఇంతవరకు ఏ ఒక్కరు కన్నెత్తి చూడని పరిస్థితి వచ్చిందన్నారు. గ్రామస్తులు వారి అవసరాలను తీర్చుకు నేందుకు వెళ్లి ఎన్నో ఇబ్బందులు పడుతూ తిరిగి గ్రామాన్ని చేరుకోవాలన్నారు. గ్రామస్తులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి ఏదైనా దరఖాస్తులు చేసుకోవాలన్న, వ్యవసాయ కూలీలు, రైతులు పంట పొలాలకు వెళ్లాలన్న నరకయాతన పడుతున్నామంటున్నారు. ఈ ప్రభుత్వంలోనైనా తమ గ్రామం నుండి చిన్న కంబలూరుకి వెళ్లే దారిని ఉన్నతాధికారులు స్పందించి నూతన రాస్తాను ఏర్పాటు చేసి రెండు గ్రామాల ప్రజల అవసరాలను, ఇబ్బందులను అవస్థలను తీర్చాలంటూ గ్రామస్తులు కోరుతున్నారు.

కార్మికుల కడుపు కొట్టిన ఘన చరిత్ర బుగ్గనది

విశాలాంధ్ర - డోన్ రూరల్: కార్మికుల కడుపు కొట్టిన దౌర్భాగ్యపు నీచ చరిత్ర బుగ్గనదని టిడిపి నాయకుడు మర్రి రమణ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో రమణ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత బుగ్గన సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకు జీతాలు చెల్లించకుండా ముప్పు తిప్పలు పెట్టారని ఎవరైనా మాట్లాడితే అక్రమ కేసులు బనాయించి పోలీసులుతో హెచ్చరికలు జారీ చేయించి మానసికంగా వేధించేవాడని తెలిపారు. సిమెంట్ ఫ్యాక్టరీలో కోట్ల రూపాయలు విలువ చేసే పాత ఇనుప సామాను అమ్ముకున్న ఘన చరిత్ర బుగ్గనదని రాజారెడ్డిపై నిప్పులు చెరిగారు. కార్మికులకు న్యాయం జరగకపోతే జిల్లా కేంద్రాలలో పోరాటం చేస్తామని మర్రి రమణ హెచ్చరించారు. అనంతరం బిజెపి నాయకులు హేమ సుందర్ రెడ్డి, కుమార్, జనసేన నాయకుడు గడ్డం బ్రహ్మాలు మాట్లాడుతూ కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడినందుకే ప్రజలు 2014 ఎన్నికలో గుణపాఠం చెప్పారని తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు: రెగ్యులర్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు చెల్లించాలని సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేసే యూనియన్ నాయకులు మోజెస్, హనుమంతరావు ఆవేదన వ్యక్తం చేశారు. బుగ్గన పార్టీకి చెందిన వ్యక్తులకే ఫ్యాక్టరీలో పనులు కల్పించి ఇతరులపై అణచి వేత ధోరణి అవలంభించి అక్రమ కేసులు నమోదు చేయించడమే ఆయన నైజం అన్నారు. ఈ కార్యక్రమంలో వాసు, రామ సుబ్బయ్య, రంగన్న, నాయుడు, జయ కృష్ణ, హనీఫ్, రామాంజనేయులు, రెడ్డి పాల్గొన్నారు.

కోలుకోలేక యువకుడు మృతి

విశాలాంధ్ర - చాగల మర్రి: మండలంలోని నగళ్లపాడు గ్రామ సమీపంలో 40వ జాతీయ రహదారిపై హైదరాబాదు నుంచి కడపకు వెలుతున్న కారు ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొని రహదారికి అటువైపుగా వెలుతున్న కారును ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో 5మంది తీవ్రంగా గాయపడ్డారు. అందులో హైదరాబాదు కాళీమందిర్ బండ్లగుండ్లజాగీర్ ప్రాంతానికి చెందిన ఐదుమందిలో వీరేన్ (17) అనే యువకుడు కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన వారిని నంద్యాల ఉదయానంద ఆసుపత్రికి తరలించారు. వీరేన్ నంద్యాల ఉదయానంద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాము వివరించారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించండి

విశాలాంధ్ర - చాగలమర్రి: కిషోర బాలికలు ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు వహించాలని వైద్యులు ఇమ్రాన్ సూచించారు. మంగళవారం చాగలమర్రి పట్టణంలోని 1, 16వ అంగన్‌వాడీ కేంద్రంలో వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుశీల ఆధ్వర్యంలో కిషోర్ బాలికలు రుతుక్రమం సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుతుక్రమం సమయంలో, పరిశుభ్రతను కాపాడటం, సరైన ఆహారం తీసుకోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడం, అవసరమైతే వైద్యుడిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎంపీహెచ్ఏ వసంతకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీహెచ్ఓల వాఖ్యలపై నిరసన

విశాలాంధ్ర - చాగలమర్రి : ఇటీవల దర్నాలో ఉన్న సిహెచ్ఓలు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరధిలో విధులు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్లు, ఆరోగ్య,ఆశ కార్యకర్తలపై చేసిన అనుచిత వాఖ్యలపై స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నల్ల బ్యాడ్జీలతో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఇటీవల దర్నాలో ఉన్న సిహెచ్ఓలపై అనుచిత వాఖ్యలు చేయడం తగదన్నారు. తమకు చదువు రాదని, జీతాలు దండగ అని,తమ వల్ల ఎటువంటి ఉపయోగం లేదనడం లాంటి అవహేళన చేయడం తగదన్నారు. తాము లేకుంటే సిహెచ్ఓలకు ఉనికే లేదన్నారు. బేషరతుగా సిహెచ్ఓలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సిహెచ్ఓ రమణమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఆరోగ్ ఆరోగ్య పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 07, మే 2025

మెగా టెక్స్‌టైల్స్ పార్క్ భూమి పూజను స్వాగతిస్తున్నాం : సీపీఐ

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు నియోజకవర్గ చేనేత కార్మికుల చిరకాల కోరిక అయినా మెగా టెక్స్ టైల్స్ పార్క్ కు ఏర్పాటుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ఎమ్మిగనూరు శాసనసభ్యులు బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బనవాసి ఫారంలో జరిగే భూమి పూజ కార్యక్రమాన్ని సీపీఐ స్వాగతిస్తుందని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి జి.రంగన్న తెలిపారు. అనంతరం సిపిఐ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం సిపిఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న మాట్లాడుతూ ఎమ్మిగనూరు నియోజకవర్గంలో దాదాపు 25 వేల మంది కార్మికులు చేనేత రంగం మీద ఆధారపడి జీవనం గడుపుతున్నాయని వారు గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో చేనేత రంగంపై ఆధారపడి పని చేస్తున్న చేనేత కార్మికులకు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతూ, జీవనాన్ని గడుపు లేక చాలామంది చేనేత కార్మికుల ఆత్మహత్య చేసుకోవడం జరిగిందని, పొట్టకూటి కోసం చేనేత కార్మికులు వివిధ రంగాల్లో పని చేస్తున్నారని తెలిపారు. గతంలో చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలని టెక్స్ టైల్ మార్కును ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి బివి మోహన్ రెడ్డి ఆశయాన్ని, ఆయన కుమారుడు బివి జయ నాగేశ్వర్ రెడ్డి నెరవేరుస్తున్నారని గుర్తు చేశారు. మెగా టెక్స్ టైల్స్ పార్కు కేవలం భూమి పూజకే పరిమితం చేయకుండా, త్వరగా నిర్మాణం పూర్తిచేసి, వేలాదిమంది చేనేత కార్మికులకు ఉపాధి కల్పించే విధంగా నియోజకవర్గ శాసనసభ్యులు బివి జయ నాగేశ్వర రెడ్డి కృషి చేయాలని సిపిఐగా కోరుతుంది. ఈ సమావేశంలో సిపిఐ మంత్రాలయం నియోజవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్, నాయకులు దాదావళి, మల్లికార్జున గౌడ్, కాజా, నరసింహులు, నాగరాజు,

చేనేత వస్త్రాలకు గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తా : రాష్ట మంత్రి

విశాలాంధ్ర - బ్యూరో కర్నూలు : ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలకు గుర్తింపు తెచ్చేందుకు తాను కృషి చేస్తానని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజి భరత్ అన్నారు. మంగళవారం. ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని బనవాసిలో ఎంఎస్ఎంఈ మెగా టెక్స్ టైల్స్ పార్క్ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రులు ఎన్ఎండి ఫరూక్, సవితమ్మలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి టిజి భరత్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో టెక్స్ టైల్స్ పార్క్ తీసుకొచ్చేందుకు ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర్ రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్క్‌ను ఏర్పాటుచేసే దిశలో తమ ప్రభుత్వం ముందుకు వెళ్తోంద న్నారు. ఎమ్మిగనూరు ఎంఎస్ఎంఈ పార్కులో పరిశ్రమలు తీసుకొచ్చేందుకు తాను పూర్తిగా సహకరిస్తానన్నారు. ముందుగా ఎకో సిస్టం తయారుచేస్తే తర్వాత పరిశ్రమలు తరలివస్తాయన్నారు. ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలతో తయారుచేసే శాలువాలను టిటిడిలో ఉపయోగించుకునేలా మాట్లాడతానని చెప్పారు. తన శాఖలో సైతం వీటిని ఉపయోగిస్తానని చెప్పారు. తమ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు. మరో రెండు దశాబ్దాల పాటు మా ప్రభుత్వం కొనసాగితే రాష్ట్రం దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రాలలో ముందు వరుసలో ఉంటుందని మంత్రి టిజి భరత్ చెప్పారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, ఆలూరు ఇంచార్జి వీరభద్ర గౌడ్, మంత్రాలయం ఇంచార్జి రాఘవేంద్ర, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, డిసిఎమ్ఎస్ చైర్మన్ నాగేశ్వర యాదవ్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఏపీఐఐసి చీఫ్ ఇంజనీర్ ప్రసాద్, ఏపీఐఐసి జోనల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, హ్యాండ్లూమ్ ఏడి నాగరాజ రావు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - కర్నూలు: 2025-26 విద్యా సంవత్సరానికి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులను ప్రభుత్వం ఆహ్వానించిందని ప్రవేట్ ఐటిఐ కళాశాలల యాజమాన్యం అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ దామోదర చౌదరి, జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆదినారాయణలు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారితో పాటు ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఐటీఐడాట్ఏపీజీవోవీడాట్ఇన్ వైబ్‌సైట్ ద్వారా వచ్చే ఈ నెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మహిళా అభ్యర్థులకు ప్రతి ట్రేడ్ నందు 33 శాతము రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. పూర్తి వివరములకు సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐల నందు సంప్రదించవచ్చన్నారు.

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యం

విశాలాంధ్ర - పెద్దకడబూరు: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడమే తన లక్ష్యమని గ్రామ సర్పంచ్ రామాంజనేయులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధుల్లో చెత్తను సేకరించి, సంపద సృష్టి కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామాంజనేయులు మాట్లాడుతూ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. చెత్త బండ్లు, ట్రాక్టర్ ద్వారా ప్రతి రోజూ ఉదయాన్నే వీధుల్లో తిరిగి చెత్తను సేకరించి సంపద సృష్టి కేంద్రానికి తరలిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వైఎస్ షర్మిల జిల్లా పర్యటన వాయిదా

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైఎస్ షర్మిల రెడ్డి ఈ నెల 11న చేపట్టిన కర్నూలు జిల్లా పర్యటన కొన్ని అనివార్య కారణాలవల్ల వాయిదాపడిందని సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని బాష మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ కార్యాలయం తదుపరి కర్నూలు పర్యటన షెడ్యూలు ఎప్పుడు అన్నది తెలిజేస్తామని షేక్ జిలాని బాష తెలిపారు.

విద్యుధాగాతంతో ఇరువురు మృతి

విశాలాంధ్ర - కౌతాళం రూరల్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రం ఆవరణంలో ప్రమాదవశాత్తు మంగళ వారం విద్యుత్ షాక్ తగిలి ఇద్దరు యువకులు మృతి చెందారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఉరుకుంద గ్రామానికి చెందిన సునీల్ (30), మహేంద్ర (22) ఆర్యవైశ్య కళ్యాణమండపంలో పెళ్లికి సంబంధించిన పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రమాదానికి గురి అయ్యారు. దీంతో అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందారు సునీల్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాదం విషయం గ్రామంలో దవానంలా వ్యాపిం చడంతో కుటుంబ సభ్యుల రొధనలు అందరిని కంటతడి పెట్టిం చాయి. సిఐ అశోక్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఆసుపత్రికి తరలించారు.

విత్తన దుకాణాలను పరిశీలించిన ఏవో

విశాలాంధ్ర - సి.బెళగల్: మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను మండల అధికారి జి.మల్లేష్ కుమార్ సందర్శించారు. సందర్శించిన అనంతరం వ్యవసాయ అధికారి జి.మల్లేష్ కుమార్ మాట్లాడుతూ మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు బీటీ పత్తి విత్తనాలలో కలుపు నివారణ నాశిని నిర్ధారణ పరీక్షలు ప్రభుత్వం వారు ఇచ్చిన కిట్ల ద్వారా కిసాన్ మాల్, శివ సాయి ఫర్టిలైజర్స్, ఓం శ్రీ నాగ సాయి ఏజెన్సీస్, విశ్వజిత్ ట్రేడర్స్ దుకాణ షాపుల నందు పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో నెగెటివ్‌గా నిర్ధారించ బడిందని వ్యవసాయ అధికారి తెలిపారు. ఆ తర్వాత బీటీ పత్తి విత్తనాలను సేకరించి తిరుపతి ల్యాబ్‌నకు పంపుతున్నట్లు వ్యవసాయ అధికారి తెలియజేశారు. ఈ కార్య క్రమంలో వ్యవసాయ సిబ్బంది, దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

విశాలాంధ్ర - వెల్దుర్తి: మండల కేంద్రంలోని సచివాలయ టు పరిధిలో 3,4,5,11, అంగన్వాడీ సెంటర్లలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల కార్యక్రమాన్ని ఉద్దేశించి సిడిపిఓ మాట్లాడుతూ కిషోర్ వికాసం ముఖ్య ఉద్దేశం బాలికలకు 1098 నంబర్ గురించి, బాల్య వివాహం జరగడం వల్ల బాలికలు జీవితంలో ఏం నష్టపోతారో ఈ కార్యక్రమంలో అవగాహన కల్పించారు. 18 ఏళ్లలోపు బలవంతంగా వివాహం జరిపించ దానికి ప్రయత్నం చేస్తే టోల్ ఫ్రీ నెంబర్ కు 1098 ఫోన్ చేయాలని కార్యక్రమంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సావిత్రమ్మ, ఈదమ్మ, రామలక్ష్మమ్మ, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి

విశాలాంధ్ర - ఓర్వకల్లు : కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృధి సాధ్యమని సిఎం చంద్ర బాబు సారద్యంలోనే రాష్ట్రం మరింత అభి వృద్ధి దిశగా పయని స్తుందని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు ఉపాధి హామీ పథకం ద్వారా రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్ల నిర్మాణాన్ని మంగళవారం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక సీసీ రోడ్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా నిర్మాణాలు చేపడుతున్నామని గత ప్రభుత్వంలో గ్రామాల్లో అభివృద్ధి జరగలేదని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు ఈఓఆర్‌డి సుబ్బారాయుడు, టిడిపి నాయకులు బి.విశ్వేశ్వర్ రెడ్డి, తలారి విజయుడు, చంద్రశేఖర్ రెడ్డి, షాంశుద్దీన్, హుసేన్, సర్కార్, ఖాజా మియ్య, ఖరీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డులను తప్పక పొందాలి

విశాలాంధ్ర - సి.బెళగల్ : భూమిని కౌలుకు తీసుకొని సాగు చేసే రైతులు తప్పని సరిగా సీసీఆర్‌సి కార్డు పొందాలని మండల తహశీల్దార్ పురుషోత్తముడు అన్నారు. మంగళ వారం మండల కేంద్రంలోని వ్యవ సాయ కార్యాలయం నందు మండల వ్యవసాయ అధికారి జి.మల్లేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కౌలు రైతుల అవగాహన సమావేశ కార్యక్రమంలో తహశీల్దార్ పురుషోత్తముడు మాట్లాడుతూ నేటి నుండి మండలంలోని అన్ని గ్రామాల యందు షెడ్యూల్ ప్రకారము గ్రామాలలో కౌలు రైతులకు సంబంధించి గ్రామ సభలు నిర్వహించ బడునని మండల వ్యవసాయ అధికారి, తహశీల్దారు తెలిపారు. కౌలు రైతులు సిసిఆర్సి కార్డు తప్పనిసరిగా పొందవలెనని తెలిపారు. ఈ కౌలు అర్హత పత్రం పొందని యెడల వారికి ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు వర్తించవని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి, తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామంలోని గ్రామ వ్యవసాయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారుల సమక్షంలో సిసి ఆర్సీ కార్డు పొందవలెనని తెలిపారు. వ్యవసాయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుండ్లకొండ దగ్గర సబ్ కెనాల్ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర -దేవనకొండ: హంద్రీ-నీవా ప్రధాన కాలువకు గుండ్లకొండ దగ్గర సబ్ కెనాల్ ఏర్పాటు చేసి గుండ్లకొండ, కె.వెంకటాపురం, మాదాపురం, గుడిమిరాల, బంటుపల్లి, బండపల్లి, బేతపల్లి, చెల్లెల చెలిమల, పి.కోటకొండ, మాచాపురం చెరువుకు నీరు మళ్లించాలని సిపిఐ మండల కార్యదర్శి ఎం.నరసారావు, బండపల్లి మాజీ సర్పంచ్ శ్రీరాములు, గుడిమిరాళ్ల తిమ్మప్ప, మాచాపురం వీరన్న, ఏపీ రైతు సంఘం మండల నాయకులు వై.కండప్ప, ఎం.వెంకటేశ్వర్లులు ఆర్డీవోను కోరారు. మంగళవారం మండల తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన పత్తికొండ ఆర్డిఓ భరత్ నాయక్‌ను ఏపీ రైతు సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో హంద్రీ-నీవా పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు, రైతులు కలిసి సాగునీటి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో హంద్రీ-నీవా ప్రధాన కాలువ ద్వారా దాదాపు 46 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాల్సిన లక్ష్యం ప్రభుత్వంపై ఉందన్నారు. ఇప్పటివరకు హంద్రీ-నీవా ద్వారా మండలంలో కొన్ని గ్రామాల రైతులకు మాత్రమే సాగునీరు అందుతుందన్నారు. దాదాపు 75శాతం గ్రామాల రైతాంగానికి ఇప్పటివరకు హంద్రీ-నీవా ద్వారా సాగునీరు అందడం లేదన్నారు. ప్రధానంగా హంద్రీ-నీవా ప్రధాన కాలువకు గుండ్లకొండ దగ్గర సబ్ కెనాల్ ఏర్పాటు చేసి గుడిమిరాళ్ల, కె.వెంకటాపురం, మాదాపురం, బంటుపల్లి, చెల్లెలచెలిమల, బేతపల్లి, బండపల్లి, వి.కోటకొండ మీదుగా మాచాపురం చెరువుకు హంద్రీ-నీవా ప్రధాన కాలువ ద్వారా సాగునీరు మళ్లించాలని గతంలో అనేకమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. మండలంపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లాలోనే అత్యధికంగా హంద్రీ-నీవా నీటిని ఉపయోగించుకుంటున్న మండలం దేవనకొండ మండలం అయితే మిగులు గ్రామాలకు హంద్రీ-నీవా ద్వారా సాగునీరు కేటాయించాలని కోరారు. ప్రధానంగా హంద్రీ-నీవా ప్రధాన కాలువకు గుండ్లకొండ దగ్గర సబ్ కెనాల్ ఏర్పాటు చేసి పి.కోటకొండ మీదుగా మాచాపురం చెరువుకు నీళ్లు మళ్లించాలన్నారు. హంద్రీ-నీవా ప్రధాన కాలువ ద్వారా మండలంలోని రైతుల పంట పొలాలకు పిల్ల కాలువల నిర్మాణం చేపట్టాలన్నారు. ఇప్పటివరకు హంద్రీ-నీవా సాగునీటికి నోచుకోని మిగులు గ్రామాలకు సాగునీరు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సురేష్, వెంకటేశు, వీరాంజనేయులు, మాబు హుసేని, చిరంజీవి, ఆంజనేయ పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - ఆస్పరి: ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి హామీ పథకం పీడి వెంకటరమణయ్య గ్రామీణ ఉపాధి శ్రామికులకు సూచించారు. మంగళ వారం మండల పరిధిలోనే అట్టేకల్లు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. గ్రామీణ ఉపాధి శ్రామికులు చేపట్టిన పంట కాలువలు, పూడికతీత పనులను పరిశీలించి మస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని శ్రామికులు ఉదయం 6 గంటలకే పనులకు వచ్చి 10 గంటల లోపు పనులు పూర్తిచేసుకుని ఇళ్లకు వెళ్లిపోవాలన్నారు. జాబ్ కార్డులు ఉన్న ప్రతి కుటుంబం 100 రోజులు పనులు పూర్తి చేసుకోవాలని, ప్రతిరోజు రూ.307 వేతనం పడేటట్లు శ్రామికులు పనులు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉపాధి సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని పిడి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ రామకృష్ణ, టిఏ, ఎఫ్ఏలు మేటీలు కూలీలు పాల్గొన్నారు.

చేనేతల అభివృద్ధి బీవీ కుటుంబంతోనే సాధ్యం

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: తండ్రి మోహన్ రెడ్డి కలను నెరవేర్చిన తనయుడు ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డిని, చేనేతల అభివృద్ధి బీవీ కుటుంబంతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ , రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత, కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం డాక్టర్ బి.జయ నాగేశ్వర్ రెడ్డితో కలిసి, జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, చేనేత జౌళి శాఖ రాష్ట్ర కమిషనర్ రేఖా రాణితో కలిసి మంత్రులు ఎమ్మిగనూరు మండలం బనవాసి గ్రామ పరిధిలోని జవహర్ నవోదయ విద్యాలయం సమీపంలో భూమిపూజలో పాల్గొన్నారు. ఈ మెగా టెక్సేల్ పార్కు కొరకు 77 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఎంఎస్ఎంఈ పార్కులో మొదటి దశలో 22 ఎకరాల్లో మూడు నెలల్లో మౌలిక సదుపాయాలు పూర్తి చేస్తామన్నారు. సదుపాయాల కోసం రూ.690 కోట్లు ఉపయోగించి అభివృద్ధి చేస్తామన్నారు. మిగిలిన 50 ఎకరాలలో టెక్స్ టైల్ రిలేటెడ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామన్నారు. పారిశ్రామికవాడకు ఎఫ్లుయెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను కూడా తీసుకొస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేనేతల సంక్షేమానికి కట్టుబడి ఉన్నారని ఎమ్మెల్యే అన్నారు. గత ప్రభుత్వం చేనేతలకు ఎటువంటి మేలు చేకూర్చలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం పవర్ లూమ్‌కి 500 యూనిట్లు, హ్యాండ్లూమ్‌కి 200 యూనిట్లు ఉచిత కరెంట్ హామీలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం చేనేతలకు సరికొత్త డిజైన్ల శిక్షణ ఇచ్చేందుకు గాను నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని,ఎమ్మిగనూరులోనూ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుకు కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్ ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి,కొడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టిడిపి మంత్రాలయం ఇంచార్జ్ రాఘవేంద్ర రెడ్డి, టిడిపి ఆలూరు ఇంచార్జ్ వీర బద్ర గౌడ్, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరయ్య యాదవ్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పురుష, మహిళా కారాగారాలు తనిఖీ

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: పురుషుల కేంద్ర కారాగారం, మహిళ కారాగారాలను తనిఖీ చేయడం జరిగినది. ఈ సందర్భంగా జడ్జి లీల వెంకట శేషాద్రి జైలు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ను తనిఖీ చేసి జైలు ఖైదీలకు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్స్ గురించి వివరించారు. ఇందులో ఒక అడ్వకేట్, ఒక ప్యారా లీగల్ వాలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయ సహాయాలు అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జైలులలో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షను పూర్తి చేయాలని కోరారు. ఖైదిలకు ఎవరికైనా న్యాయవాదులు లేకుంటే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. 70 ఏళ్ళు వయస్సుపై బడిన ఖైదిలకు, అనారోగ్యంతో బాధ పడే వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని, త్వరగా బెయిల్ మంజూరు అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఖైదిలకు అందించే ఆహారాన్ని, రేషన్‌ను వారి ఆరోగ్యం గురించి తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఖైదిలను కోర్ట్ వాయిదా లకు కచ్చితంగా హాజరు చెయ్యాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కర్నూలు వారిని సంప్రదించవచ్చును అన్నారు, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు, లాయర్ శివరాం మరియు ఖైదీలు పాల్గొన్నారు.

రాయలసీమ యూనివర్సిటీ హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి : ఐసా

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: రాయలసీమ యూనివర్సిటీ క్యాంపస్ హాస్టల్లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్-ఐసా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం యూనివర్సిటీ రిజిస్ట్రార్ విజయ్ కుమార్ నాయుడుకు వారు వినతిపత్రం సమర్పించారు. ఐసా జిల్లా కార్యదర్శి ఎస్. నాగార్జున మాట్లాడుతూ ప్రస్తుత మెస్‌లో భోజనం నాణ్యత తక్కువగా ఉండటంతోపాటు, స్టీ వార్డెన్లు మెనూ ప్రకారం సరుకులు ఇవ్వకుండా వారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ మెనూ ప్రకారం పెట్టడం లేదని దీనివల్ల విద్యార్థులు అర్థ ఆకలితో అలమటిస్తున్నారని డిప్యూటీ వార్డెన్లు ప్రతిరోజు మెనూ ప్రకారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తుంగభద్ర, సంగమేశ్వర, జోగులాంబ హాస్టళ్లలో చేపట్టిన మరమ్మత్తు పనులు చాలా నెమ్మదిగా నత్తనడకన జరుగుతున్నాయని, వీటిని వేగంగా పూర్తి చేయాలని ఐసా డిమాండ్ చేసింది. హాస్టల్స్‌లో అపరిశుభ్రత కారణంగా దుర్వాసన కలుగుతోందని, శౌచాలయాలు, స్నానాల గదు లను తక్షణమే శుభ్రపరచాలన్నారు. విద్యార్థులు మెస్‌లో భోజనం చేయాలంటే తమ సొంత ప్లేట్లు తీసుకు రావాల్సిన పరిస్థితి ఉందని, మెస్ హాల్లో ప్లేట్లను ఏర్పాటు చేయాలని కోరారు. మెస్ వ్యవస్థను పర్యవేక్షించేందుకు కొత్త కమిటీలను ఏర్పాటు చేయాలని, చీఫ్ వార్డెన్ భోజన నాణ్యతపై నిత్యం తనిఖీలు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘం నాయకులు మౌలాలి ఐసా నాయకులు సునీల్, సాయి, విద్యార్థులు కృపాకర్ పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న విద్యా సంస్థలను సీజ్ చేయాలి

విశాలాంధ్ర - ఆదోని : డివిజన్ వ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు ఫీజుల దోపిడి పుస్తకాల వ్యాపారం అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి దస్తగిరి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాక ముందే కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేస్తూ, మే నెలలో చేసుకుంటే ఒక ఫీజు జూన్లో చేసుకుంటే మరొక ఫీజు అని తల్లి దండ్రులకు మాయమాటలు చెప్పి లక్షల రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నిర్ణయించిన గ్రూపులు కాకుండా విద్యార్థులలో బేధాలు ఉండే విధంగా చదువుకున్న వారికి ఒక గ్రూపు తక్కువ చదువుకున్న వారికి ఒక గ్రూపు అంటూ టెక్నో సి.బ్యాచ్, ఐకాన్, ఐపిఎల్, ఎంపీఎల్, ఒలంపియాడ్ రకరకాల గ్రూపుల పేర్లు ఏర్పాటు చేసి ఒక గ్రూపుకు ఒక్కొక్క ఫీజు రూపాన వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. పుస్తకాల వ్యాపారంతో పాటు స్టేషనరీ వ్యాపారం చేస్తున్నారని, ఆదోనిలో చాలా విద్యాసంస్థలు అద్దె అపా ర్ట్మెంట్లలో నిర్వహిస్తూ అనుమతులు లేకుండా కనీసం విద్యార్థులకుక్రీడా మైదానం లేకుండా సరైన వసతులు లేకుండా విద్యాసంస్థలు నిర్వహి స్తూ ఫీజులు వసూలు చేయడమే ధ్యేయంగా చేస్తు న్నారని విమర్శించారు. విద్యను వ్యాపారంగా చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోలేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ డివిజన్ నాయకులు, రవి, నాని,తరుణ్ వరుణ్ షాకిర్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యుడి ప్రతాపం

భగ్గుమంటున్న ఎండలకు తల్లడిల్లుతున్న ప్రజలు

గిరాకి పెరిగిన శీతలపానియాలు



విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : సూర్యప్రతాపం వలన జిల్లాలో ప్రజలు తల్లడిల్లి పోతున్నారు. ఉదయం 10 గంటల నుండి వేడిగాలులు వీస్తుండటంతో బయటకు రావాలంటే ప్రజలు భయపడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు వేసవి తాపంకు అల్లాడుతున్నారు. పరీక్షలు పూర్తి అయిన విద్యార్థులు, పిల్లల వేసవి సెలవులు వచ్చాయనే ఆనందం ఒకవైపు మరో వైపు ఎండలకు భయటకు పోవాలంటే భయపడుతున్నారు. వాతావరణంలో కొంత మార్పు వచ్చి జిల్లాలో అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నా ఎండలు మాత్రం తగ్గడం లేదు. ఉదయం 11 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఎండ, వడగాలులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.మధ్యాహ్నం12నుండి సాయంత్రం 3 గంటల వరకు రోడ్ల కర్ఫ్యూ వాతావరణం తలపిస్తున్నాయి. నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే రోడ్లు వెలవెల పోతున్నాయి. దీంతో ప్రజలు శీతలపానియాల వైపు దృష్టిసారించారు. చల్లని నీరు తాగేందుకు చల్లని కుండలను ఆశ్రయిస్తే అవి ఒకటి రూ.250 చెపుతున్నారు. ఇక కొబ్బరి బోండంను అంటే భయపడే పరిస్థితి నెలకొంది. కొబ్బరి బొండాల వ్యాపారులు సిండికేట్ అయి ధరలు పెంచి ఒక్కో కొబ్బరి బోండం రూ.70 విక్రయాలు చేస్తున్నారు. లీటరు కొబ్బరిబోండం నీళ్ళు రూ.200 విక్రయిస్తున్నారు. అవికూడా మంగళవారం దొరకని పరిస్థితి నెలకొంది. కూల్ డ్రింక్స్ వ్యాపారులు ఇదే అదునుగా భావించి వ్యాపారం చేసుకుంటున్నారు. వారి వ్యాపారం కాసుల వర్షం కురిపిస్తుంది. విజయ మజ్జిగ ప్యాకెట్ కూడా రూ.10 నుండి రూ.12 విక్రయిస్తున్నారు. కూల్‌డ్రింక్స్ వ్యాపారులు మంది ఎక్కువ అయ్యో కొద్ది మజ్జిగ పలచన అవుతున్నాయి. చల్లగా ఉన్నాయని తాగడం తప్పితే అందులో మజ్జిగ కరువైతున్నాయి. వేసవి కాలంలో ముఖ్యంగా ప్రతి ఒక్కరు కలెంగరి ,కరబుజ, ఈసీజన్‌లో మాత్రమే లభ్యమయ్యో మామిడి పండ్లను ఎక్కువగా కొనుగోలు చేస్తారు. అయితే వ్యాపారులు కలెంగరి పండు కిలోల లెక్కన కిలో రూ 25 లెక్కన విక్రయాలు చేస్తున్నారు. కరబుజన రూ.100 మూడుకిలోల లెక్కన విక్రయాలు చేస్తుండగా, మామిడి ఎన్నడూ లేని విధంగా కిలో రూ.80 లెక్కన విక్రయాలు చేస్తున్నారు. తాటి ముంజలు డజను రూ.40 లెక్కన విక్రయాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక వైపు సూర్యుని ప్రతాపంతో విలవిల లాడుతుండగా మరో వైపు ఇదే అదనుగా భావించి వ్యాపారులు అధిక ధరలకు విక్రయాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

కళారాధన కళా సేవలు ప్రశంసనీయం: మంత్రి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: కళారాధన సాంస్కృతిక సంస్థ నంద్యాలలో 2000 సంవత్సరంలో ప్రారంభించబడి గత 25 సంవత్సరాలుగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నది. ఈ సందర్భంగా కళారాధన రజతోత్సవ వేడుకలలో భాగంగా సంవత్సరం పొడవునా భారీ రాష్ట్రస్థాయి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ రజతోత్సవ కార్యక్రమాల లోగోను రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఫరూక్ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కళారాధన అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ రవి కృష్ణల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాలలో కళారాధన సాంస్కృతిక సంస్థ నిర్విరామంగా గత 25 సంవత్సరాలుగా అనేక కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ఇంత సుదీర్ఘకాలం ఇన్ని కార్యక్రమాలను నిర్వహించడం చిన్న విషయం కాదని, ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి, అంకితభావంతో కళాయజ్ఞం కొనసాగించి నంద్యాల కళావైభవాన్ని రాష్ట్ర నలుమూలల, దేశంలో వివిధ ప్రాంతాలలో తీసుకువెళ్లారని అభినందించారు. డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ రవికృష్ణలు మాట్లాడుతూ కళారాధన ప్రతిఏటా మే నెలలో కళాసాధన పేరిట 20 అంశాలలో, 25 మంది శిక్షకులతో, 400 మంది బాలబాలికలకు ఉచిత శిక్షణ శిబిరాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తూ శిక్షణ పొందిన వారితో ముగింపు ఉత్సవంలో ప్రదర్శనలు ఏర్పాటు చేసి బాలలలో సాంస్కృతిక కళల పట్ల అభిరుచిని పెంచడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఫయాజ్, సుంకర రాజశేఖర్ ప్రసాద్, కళారాధన యువజన విభాగం అధ్యక్షులు పత్తి రంగనాథ్, యువజన విభాగం కార్యదర్శి నాగేంద్ర, రాజా తదితరులు పాల్గొన్నారు.

అప్కాస్‌లోనే కొనసాగించాలి

విశాలాంధ్ర-డోన్: మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌లోనే కొనసాగించాలని మున్సిపల్ రంగంలో కాంట్రాక్ట్ రంగాన్ని తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేసి ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య, ఏఐటియుసి డోన్ నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు ఎస్. అన్వర్, జి.అబ్బాస్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు హరి.డోన్ మున్సిపల్ యూనియన్ నాయకులు సంజీవ కుమార్, అజయ్ రెడ్డి, చంద్ర, గౌస్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళ వారం స్థానిక మున్సిపల్ కమిషనర్‌కి ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ఎదుర్కొన్న సమస్యలు పరిష్కారం చేయాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుంకయ్య మాట్లాడుతూ గత అనేక సంవత్సరముల నుండి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులుగా తక్కువ వేతనంతో విధులు నిర్వహిస్తూ అష్ట కష్టాలతో కుటుంబాన్ని నడుపుకుంటూ ఉద్యోగానికి ఎలాంటి భద్రత లేకుండా జీవితాలు గడుపుతున్న మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయకపోగా ఇప్పుడు ఆప్కాస్ లో కొనసాగిస్తున్న కార్మికులను కాంట్రాక్ట్ రంగం లోకి మార్చి వారి చేతుల్లో బానిసలుగా ఉండి ఉద్యోగానికి భద్రత లేకుండా ఉండే ప్రమాదాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని వారు ఆగ్రహించారు. ఇంజనీరింగ్ కార్మికులకు పారిశుద్ధ కార్మికుల వలే రూ.21 వేలు వేతనం వెంటనే పెంచాలన్నారు. సంక్షేమ పథకాలు విడో పింఛన్‌తో సహా వెంటనే అమలు చేయాలన్నారు. విధుల్లో మరణించిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం నష్టపరిహారంగా రెండు లక్షల రూపాయలు వెంటనే చెల్లించాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు సేఫ్టీ ప్రికాషన్స్ బూట్లు బ్లౌజులు కటింగ్ ప్లేయర్స్ టెస్టర్స్ స్క్రూ డ్రైవర్లు ఎలిమెంట్స్ వెంటనే పంపిణీ చేయాలన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా ఇంజనీరింగ్ విభాగంలో కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. పెండింగ్లో ఉన్న పీఎఫ్ ఈఎస్ఐ పరిష్కరించాలి, జాతీయ రాష్ట్ర పండుగ సెలవులు ఇవ్వాలని, సమస్యల పరిష్కారం కోసం ఈనెల 7వ తేదీ నుండి ఇంజనీరింగ్ కార్మికుల నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 20వ తేదీన కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశ వ్యాప్త సమ్మె లో విధులు బహిష్కరించి పాల్గొంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగస్వామి సురేష్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

శ్రీ సుంకుల పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

విశాలాంధ్ర -గడివేముల: మండలంలోని బూజునూరు గ్రామంలో మంగళవారం నాడు శ్రీ సుంకుల పరమేశ్వరి అమ్మవారి ఊరుదేవర తిరుణాల మహోత్సవ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, నందికొట్కూరు టిడిపి ఇన్చార్జి గౌరు వెంకట్ రెడ్డి శ్రీ సుంకుల పరమేశ్వరి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు, రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని సరైన సమయానికి వర్షాలు కురిసి పాడి పంటలతో గ్రామాల అభివృద్ధి కావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు పూలమాలతో శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పంట రామచంద్రారెడ్డి, దిలీప్ కుమార్ రెడ్డి, మండల కన్వీనర్ దేశం సత్యనారాయణరెడ్డి, మాజీ మండల అధ్యక్షులు వంగాల శ్రీనివాస్ రెడ్డి, దేశం నారాయణరెడ్డి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి నాయకులు ప్రత్యేక పూజలు : శ్రీ సుంకుల పరమేశ్వరి అమ్మవారి ఊరు దేవర తిరుణాల మహోత్సవ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూలు వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్ రెడ్డి, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, కర్నూల్ మేయర్ బి వై రామయ్య, నంద్యాల మాజీ ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి శ్రీ సుంకుల పరమేశ్వరి అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సర్పంచ్ రాములమ్మ, వై శివరామిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, రఘు మాధవరెడ్డి, ఎల్లారెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, ఉండుట్ల రవీంద్రనాథ్ రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి

విశాలాంధ్ర- గడివేముల: మండల కేంద్రమైన గడివేములోని ఆశా వర్కర్లు తమ డిమాండ్లను నెరవేర్చాలని వైద్యాధికారి కిరణ్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపుతో దేశవ్యాప్తంగా మే 20న జరుగుతున్న, జరిగే సమ్మెలో ఆశా వర్కర్లు పాల్గొని తమ డిమాండ్లను నెరవేర్చుకోవాలని తెలిపారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని,కనీసం వేతనాలు రూ.28 వేలు చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లని ఆశాలుగా మార్చాలని, ఒప్పంద జీవో విడుదల చేయాలన్నారు.ఆశా నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలి, సంక్షేమ పథకాలు అమలు చేయాలి, పీహెచ్‌సీ మీటింగ్‌లకు టీఏ,డీఏలు ఇవ్వాలని ఆశ వర్కర్లకు సంబంధం లేని పనులు చేయించరాదన్నారు. తమ డిమాండ్ల సమస్యలను నెరవేరే వరకు పోరాటం చేస్తామని ఆశ వర్కర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు చెన్నమ్మ, లక్ష్మి, ఆశ, తదితరులు పాల్గొన్నారు.

యువత ఆన్‌లైన్ గేమ్స్ జోలికి వెళ్ళవద్దు : డీఎస్పీ

విశాలాంధ్ర - పాములపాడు : మండలంలోని లిఇస్కాల గ్రామంలోలి రోడ్డు, శాంతి భద్రతలు సైబర్ నేరాలు ఆన్లైన్ గేములపై గ్రామ సభ సోమవారం రాత్రి నిర్వహించడమైనది. ఈ సందర్భంగా టి.రామాంజనేయ మాట్లాడుతూ యువత ఆన్లైన్ గేమ్లు, ఆన్లైన్ లోన్లు, యాప్స్ ఓటీపీలు ఆన్లైన్ ట్రాన్సాక్షన్, ఎవరైనా ఆన్లైన్లో ఉద్యోగానికి ఇస్తామన్నా సైబర్ నేరాలు తదితర వాటిపై జాగ్రత్తగా ఉండాలని ఆయన తెలిపారు. ఇటీవల కాలంలో కొన్ని కుటుంబ కలహాలతో, అప్పులు పెరిగాయని ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ప్రతి సమ స్యకు ఒక పరిష్కారం ఉంటుందని కనుక ఎట్టి పరిస్థితుల్లో ఆత్మ హత్యలు చేసుకోకూడదని, ఏదైనా సమస్యలు ఉన్నట్లయితే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి సమస్యను పరిష్కరించు కోవాలని తెలిపారు. ఇటీవల కాలంలో సెల్ ఫోన్ వినియోగం ఎక్కువైందని, తల్లిదండ్రులు పిల్లలు పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎండాకాలం సెలవులు కావున పిల్లలు ఈతకు కెనాల్, బావుల వద్దకు వెళుతున్నారని, పిల్లలు ఎక్కడకు వెళుతున్నారనేది గమనించాలని, ఎక్కడకు వెళ్లినా తల్లిదండ్రులకు చెప్పాలని పిల్లలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామ సర్పంచి వివిధ పార్టీ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టండి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : గత సమావేశాల్లో చర్చించిన ప్రజా సమస్యలను జాప్యం చేయకుండా, త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టిజి భరత్ నగరపాలక అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో నగరపాలక అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరాభివృద్ధిపై, ప్రజా సమస్యల పరిష్కారంపై సుదీర్ఘంగా చర్చించారు. ముందుగా గతంలో జరిగిన 5 సమావేశాల చర్చించిన అంశాలపై పురోగతిపై చర్చించారు. అనంతరం పూడికతీత పనులపై ఆరా తీశారు. అన్ని వార్డుల్లో పకడ్బందీగా పూడికతీత పనులు నిర్వహించాలని ఆదేశించారు. తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా సుంకేసుల జలాశయంలో తగిన నీరు ఉండేలా చూసుకోవాలని, ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకోరావాలని సూచించారు. సుద్దవాగు అంతట పూడికతీత పనులు చేపట్టాలని, అవసరమైన చోట్ల రక్షణ వలయం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. జులై నెలాఖరు నాటికి ఎస్‌ఏపి క్యాంపులో బైపాస్ రహదారి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మొబైల్ క్యాంటీన్‌ల వివరాలు తీసుకుని, ట్రాఫిక్‌కి ఇబ్బంది కలిగించే రహదారులపై కాకుండా వారికి అనువైన ప్రదేశాన్ని వ్యాపారం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పుష్‌కార్ట్‌ల మరమ్మత్తులు త్వరితగతిన పూర్తి చేసి, ఇంకా కొత్తవి కొనుగోలు చేయాలని సూచించారు. అంబేద్కర్ కూడలి నుండి పెద్దమార్కెట్ వరకు రహదారి విస్తరణ చేపట్టాలని పేర్కొన్నారు. అనంద్ థియేటర్ సమీపంలోని హంద్రీ ఒడ్డున ప్యాకెట్ పార్కు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 17న పారిశుద్ధ్య విభాగం అధికారులతో, కాంట్రాక్టర్లతో వేర్వేరు సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అశోక్ నగర్ రైల్వే బ్రిడ్జి డ్రైనేజీ సమస్య త్వరగా పరిష్కరించాలని, ఆలోపు ప్రత్యామ్నాయంగా తాత్కాలికంగా పరిష్కారించాలని ఆదేశించారు. కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్ల రోజువారీ సంఖ్య పెంచాలన్నారు. బుధవారపేట హిందూ స్మశాన వాటికలో మౌలిక సదుపాయాల పనులు వెంటనే పోటీ చేయాలన్నారు. అమీర్ మియా బిల్డింగ్ త్వరగా కూల్చేయాలని, వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ యస్.రవీంద్ర బాబు, అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ఓలు పాల్గొన్నారు.

మోహిని అలంకారంలో.. జ్వాల నరసింహస్వామి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన ఎగువ అహోబిలంలో వైశాఖ మాస నరసింహ జయంతి బ్రహ్మో త్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం ఉత్సవమూర్తులైన జ్వాల నరసింహ స్వామిని అర్చకులు మోహిని అలంకారంలో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం మోహిని అలంకారంలో ఉన్న స్వామివారిని పల్లకిలో ఆశీనులను చేసి పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ మాడవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో మోహిని అలంకారంలో ఉన్న నరసింహ స్వామిని భక్తులు తిలకించి తన్మయత్వం పొందారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా సినీ నటుడు పరుచూరి వెంకటేశ్వ రరావు మనవడు పరుచూరి సుదర్శన్ వ్యవహరించి స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. రాత్రి శరభ వాహనంలో జ్వాల నరసింహ స్వామి కొలువుతీరి భక్తులకు దర్శనం ఇచ్చారు. ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ మాడవీధులగుండా గ్రామోత్సవం నిర్వహించారు.

ఆశాలు తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - సి.బెళగల్: దేశ వ్యాప్తంగా ఈ నెల 20న తలపెట్టిన ఆశా వర్కర్ల సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులను సిఐటియు నాయకులు మోహన్ కోరారు. మంగళవారం ఆశా వర్కర్ల తో సమావేశం నిర్వహించి సీఎంఓ మహేశ్వరమ్మకు వినతి పత్రం అందజేశారు. అనంతరం మోహన్ మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో జీవితం కొనసాగిస్తున్నారని అయినా వచ్చిన ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను విస్మరిస్తూ వారికి చాలా అన్యాయం చేస్తున్నారన్నారు. అనేక హక్కుల సాధనకు ఈ సమ్మె గుణపాఠం కావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆశా డే మీటింగ్..

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బైర్లూటి నందు ఆశా డే మీటింగ్ డాక్టర్ జి.పవన్ కుమార్, మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో డాక్టర్ లక్ష్మణ్ నాయక్ జోనల్ మలేరియా ఆఫీసర్ పర్యవేక్షణలో, కుద్దూస్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, రవణమ్మ, మధు ఆరోగ్య పర్యవేక్షకులు, కల్లూరి పెద్ద మస్తానయ్యల ఆధ్వర్యంలో ఆశా డేను మంగళవారం నిర్వహించారు. నర్సింగ్ ఆఫీసర్ తులసి ల్యాబ్ ఆఫీసర్ సోమేశ్వరి, సివైటిబి అందరూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేయుచున్న ఆరోగ్య కార్యకర్తలు పద్మావతి, కిరణ్మయి, శారద, శారదమ్మ, స్వర్ణలత ఇందిరా ప్రభావతి సాయమ్మ భీమేశ్వరమ్మ, ఆశ కార్యకర్తలు సివైటిబి వ్యాక్సిన్ వేయించుకోవడం జరిగినది ఆరోగ్య కార్యకర్తలను, సూపర్వైజర్ స్టాఫ్ వారిని నిందించిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ వారిని తగిన చర్య తీసుకోవాలని డాక్టర్ పవన్ కుమార్ మెడికల్ ఆఫీసర్‌కి మెమొరండంను సమర్పించి, ఆశా డే సందర్భంగా ఆశ కార్యకర్తలకు వారు చేయవలసిన కార్యక్రమాలు అన్నిటిని కుద్దూస్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, రవణమ్మ ఆరోగ్య పర్యవేక్షకురాలు, కల్లూరి పెద్ద మస్తానయ్య సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ టీబి యూనిట్ ఆత్మకూర్ క్షయ వ్యాధిపై అవగాహన తెలిపారు.

ఎంపీపీని పరామర్శించిన ఉద్యోగులు

విశాలాంధ్ర-అవుకు: అవుకు మండల పరిషత్ అధ్యక్షుడు చల్లా రాజశేఖర్ రెడ్డిని ఎంపీడీవో వెంగన్న ఆధ్వర్యంలో ఉద్యోగస్తులు పరామర్శించారు. అస్వస్థతకు గురై చికిత్స అనంతరం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్న ఎంపీపీ చల్ల రాజశేఖర్ రెడ్డిని ఎంపీడీవో వెంగన్న, మండల విద్యాధికారి శ్రీధర్ రావు, మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్, ఉపాధ్యాయులు నాగూరు ప్రసాద్, సదాశివయ్య, సంజీవరెడ్డి తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారితో ఆయన మాట్లాడుతూ పరామర్శించడానికి వచ్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఆరోగ్యం మెరుగు పడడానికి కొంత సమయం పడుతుందని అన్నారు.

ఏడాది కన్నా భారీగా పెరిగిన ఆదాయం

విశాలాంధ్ర - నందికొట్కూరు: పట్టణంలోని శ్రీ సుంకుల పరమేశ్వరి దేవాలయం సముదాయంలో ఏడాది పాటు దుకాణాల నిర్వహణ వేలంలో రూ. 8లక్షలు ఆదాయం వచ్చినట్లు దేవాలయ ఈవో సాయి కుమార్ తెలిపారు. మంగళవారం ఆలయ పరిసరాల్లోని ఖాళీ స్థలాలకు మూడు సంవత్సరాల కాల పరిమితి కింద శ్రీ సుంకుల పరమేశ్వరి దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆలయ కార్యనిర్వహణ అధికారి సాయికుమార్ సమక్షంలో ఆలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించారు. ఉదయం నిర్వహించిన బహిరంగ వేలాల్లో ఆలయానికి తూర్పు వైపు నున్న ఖాళీ స్థలమును రూ. 6.5 లక్షలకు బహిరంగ వేలం పాట ద్వారా శివకుమార్ దక్కించుకున్నారని, అదేవిధంగా ఆలయానికి పడమర పక్కన ఉన్న ఖాళీ స్థలమును శ్రీరామ థియేటర్ యజమాని ఎం.రామిరెడ్డి రూ.13.8 లక్షలకు బహిరంగ వేలంలో దక్కించుకొన్నట్లు ఈవో తెలిపారు. అయితే ఆలయ పరిసరాల్లోని షాపులకు నిర్వహించిన బహిరంగ వేలాల్లో చాలా మంది వ్యాపారులు ధరావత్తు చెల్లించి పోటీలో పాల్గొనడంతో పోటీ పెరిగింది. దీంతో తీవ్ర ఉద్రిక్తత మధ్య వేలాలు జరిగాయి.గత ఏడాది వేలంపాటలో దాదాపు రూ.11.70 లక్షలు వేలం పాట జరుగగా ఈ ఏడాది 2025 నుంచి 2028వరకు రూ.19.13 లక్షలు వేలం పాట జరిగింది. దీనితో దేవస్థానానికి ఏడాదికి దాదాపు రూ.8లక్షలు ఆదాయం పెరిగిందని వేలం పాటలో వచ్చిన ఆదాయంను బ్యాంకులో డిపాజిట్ చేసి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆలయ అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తామని తెలిపారు. వేలంపాటలో ఎలాంటి అవాంఛనియా సంఘటనలు జరగకుండా నందికొట్కూరు పట్టణ ఎస్సై చంద్రశేఖర్ తన సిబ్బందితో బందోబస్త్ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, రైతు సంఘం నాయకులు రవి, తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 9 నుండి చెన్నకేశవడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



విశాలాంధ్ర-అవుకు: పట్టణంలోని కోటవీధుల వెలిసిన అతి పురాతనమైన ఆలయాల్లో ఒకటైన శ్రీ భూలక్ష్మి చెన్నకేశవ స్వామి తిరు కళ్యాణ బ్రహ్మోత్స వాలు ఈనెల 9వ తేదీ నుండి ప్రారంభమవుతాయి అని బ్రహ్మోత్సవాల కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9వ తేదీన సంకల్పం, పుణ్యాహవచనం, ధ్వజారోహణం, మృత్సం గ్రహణము, అంకురార్పణ, కలశస్థాప నాధులు, 10వ తేదీన శనివారము వేకువ జామున స్వామివారి కళ్యాణ మహోత్స వానికి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులు తలంబ్రాల బియ్యం, పట్టు వస్త్రాలు సమర్పిస్తారని మాంగళ్యమునకు ఉభయ దారులుగా ఉంటారని అన్నారు. అదే రోజు రాత్రి హనుమంత వాహనం, 12వ తేదీ సోమవారం శేష వాహనము, 13వ తేదీ గరుడ వాహనము, 14వ తేదీ గజవాహనము, 15వ తేదీన సాయంత్రం రథోత్స వము, 16వ తేదీన తిరురథోత్సవం, 17వ తేదీ తీర్థవాది, ధ్వజా రోహణము, వసంతోత్సవముతో బ్రహ్మోత్సవాల ముగుస్తాయని అన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడ సేవ రోజున ఆర్కెస్ట్రా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించను నట్లు తెలిపారు.

రాతిదూలం పోటీలు : శ్రీ భూలక్ష్మి చెన్నకేశవ స్వామి తిరు కళ్యాణమహోత్సవం సందర్భంగా జాతీయ స్థాయి ఒంగోలు జాతి సీనియర్ వృషభరాజముల బల ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి బహుమతుల దాతగా మొదటి బహుమతి లక్ష రూపాయలు, రెండవ బహుమతి రూ.80 వేలు, మూడవ బహుమతిగా రూ.60 వేలు, నాలుగో బహుమతిగా రూ.40 వేల, ఐదవ బహుమతిగా రూ.20వేలు, ఆరో బహుమతిగా పదివేల రూపాయలను అందజేస్తున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనదలచిన వృషభరాజ యజమానులు 16వ తేదీ ఉదయం 6 గంటల్లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. ఇతర వివరాలకు టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట రమణ నాయకులు సంప్రదించాలని అన్నారు.

ఉచిత లలిత కళల శిక్షణా శిబిరం ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : కళారాధన సాంస్కృతిక సంస్థ నంద్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత లలిత కళల, క్రీడల వేసవి శిక్షణా శిబిరాన్ని స్థానిక కేఎన్ఎం పురపాలక పాఠశాల ఆవరణలో మంగళవారం ప్రముఖ న్యాయవాది, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెదుర్ల రామచంద్రరావు జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. కళారాధన అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవికృష్ణ, కార్య నిర్వాహక కార్యదర్శి ఎస్ ఆర్ ఎస్ ప్రసాద్, క్యాంప్ కోఆర్డినేటర్ పత్తి రంగనాథ్ నిర్వహణలో జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వెదుర్ల రామచంద్రరావు, విశిష్ట అతిథిగా పురపాలక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అసదుల్లా పాల్గొన్నారు. కళారాధన అధ్యక్షులు డాక్టర్ మధుసూదన్ రావు మాట్లాడుతూ ఈ సంవత్సరం మే 1వ తేదీ నుండి మే 31 వరకు కళా సాధన- 2025 వేసవి శిబిరం నిర్వహించడం జరుగుతున్నదని, మంగళవారం లాంఛనంగా ప్రారంభించామన్నారు. వేసవి సెలవులను బాలలు, యువత సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. వెదుర్ల రామచంద్రరావు మాట్లాడుతూ కళలు, క్రీడలు బాలల మానసిక, వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయని తద్వారా చదువులో కూడా రాణించడానికి అవకాశాలు మెరుగవుతాయని అన్నారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ దేశంలో ఇన్ని అంశాలలో, ఇంత మంది శిక్షకులతో, దాదాపు 400 మంది బాల బాలికలకు 25 సంవత్సరాలుగా ఉచితంగా నిర్వహిస్తున్న ఏకైక సంస్థ కళారాధన అన్నారు. ఈ నెల 31న తేదీ టౌన్ హాల్‌లో జరిగే ముగింపు ఉత్సవంలో శిక్షణ పొందిన బాలబాలికల చేత ప్రదర్శనలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

శ్రీ వీరబ్రహ్మం గారి 332వ అరాధనోత్సవాలు

విశాలాంధ్ర - బనగానపల్లె: కాలజ్ఞాన తత్వవేత్త శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అరధానోత్సవాలు ఈ నెల 7 నుంచి 9 వరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు బనగానపల్లె శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం నేలమఠం ప్రధాన అర్చకస్వామి శ్రీనివాసాచారి మంగళవారం తెలిపారు. శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నడయాడిన పుణ్యస్థలిగా బనగానపల్లె ఖ్యాతి కలిగివుంది. కాలజ్ఞాన తత్వవేత్తగా ప్రసిద్ధిగాంచిన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి 16వ శతాబ్దంలో తన చిన్నతనంలోనే బనగానపల్లెకు వచ్చి యుక్తవయస్సు వరకు ఇక్కడే గరిమిరెడ్డి అచ్చంమాంబ ఇంట పశువులకాపరిగా వుండి రవ్వలకొండపై ఉన్న ఒక గుహలో కూర్చొని ప్రస్తుతం లోకవ్యాప్తంగా జన బాహుళ్యంలో ఉన్న కాలజ్ఞానం తత్వాలను తాటియాకులపై రచించాడు. ఆయన నడయాడిన ఈ ప్రాంతంలో బ్రహ్మంగారు స్వయంగా శివలింగప్రతిష్ఠ చేసిన ఆలయం బనగానపల్లె నంద్యాల రహదారిలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్తానం (నేలమఠం)గా, ఆయన నివాసమున్న గరిమిరెడ్డి అచ్చమాంబ గృహం శ్రీ అచ్చమాంబ దేవస్థానంగా, కాలజ్ఞానం రచించిన గుహ ఉన్న రవ్వలకొండ ప్రముఖ యాత్రా స్థలంగా పేరుగాంచాయి. శ్రీ బ్రహ్మంగారు తాను రచించిన కాలజ్ఞాన తాటియాకు పత్రాలు బనగానపల్లెలోని అచ్చంమాంబ మఠంలోని ఒక నేలమాళిగలో నిక్షిప్తం చేసి అక్కడనుండి కడపజిల్లా కందిమల్లయ్యపల్లె చేరుకొని అక్కడే సంసారజీవితం గడిపి1693లో సజీవసమాధి అయ్యారు.ఆయన జీవసమాధి అయిన వైశాఖ శుద్ధ దశమిరోజున ఆయన నడయాడిన బనగానపల్లెలో, జీవసమాధి చెందిన కందిమల్లయ్యపల్లె బ్రహ్మంగారి దేవస్థానాల్లో ప్రతియేటా ఆరాధానోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. 7న ఆరాధన పల్లకిసేవ, 8న గ్రామోత్సవం 9న మహానివేదన కార్యక్రమాలు వుంటాయని మఠం పూజారి శ్రీనివాస్ ఆచారి తెలిపారు.

వైభవంగా సీతారాముల కళ్యాణం

విశాలాంధ్ర- కోవెలకుంట్ల : పట్టణ పరిధిలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం నిర్మాణం చేపట్టి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలో భాగంగా మూడవరోజు ఎల్లాల సతీష్ శర్మ ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటలకు గణపతి పూజ, ప్రాతకాలపు పూజ, రుద్రాభిషేకం, సూర్య నమస్కారాలు, భగవద్గీత పారాయణం, ఈ యాగంలో భాగంగా రుద్ర హోమం, చండీ హోమం, సుబ్రమణ్య స్వామి హోమం, మండి హోమం, గాయత్రి హోమం నిర్వహించారు. సీతారాముని కళ్యాణం వేడుకలో వరుడు తరపున కర్నాటి సుబ్బరాయుడు దంపతులు వారి కుమారుడు కర్నాటి అభిలాష్, కుమార్తె కామిశెట్టి శర్వాణి, అల్లుడు దీక్షిత్ వధువు తరపున బైసాని రవి ప్రకాష్,బైసాని ఉమామహేష్ దంపతులు, వారి కుమారులు నరసింహ ప్రణయ్, భార్గవులు కలిసి సీతారాముల కళ్యాణం ను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఐదున్నర గంటలకు ప్రదోషకాల పూజ, 108 పర్యాయములు లలిత సహస్రనామములు, విశేష కుంకుమార్చన తీర్థ ప్రసాదాల కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలో భాగంగా 50 మంది ఆర్యవైశ్య సంఘం మహిళలకు మహిళా సంఘ ఆధ్వర్యంలో ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 7 గంటల నుండి సీతారాముల గ్రామోత్సవ కార్యక్రమం ఈ సందర్భంగా నిర్వహించిన కల్చరల్ ప్రోగ్రామ్స్ ఎంతో మందిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పెండేకంటి సుబ్రహ్మణ్యం దంపతులు, పెండేకంటి నాగరాజు దంపతులు, కాలువ శివ నాగేంద్ర దంపతులు, కర్నాటి అభిలాష్ ఆర్యవైశ్య యువజన సంఘ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.